క్లుప్తంగా

'పోరుబాట'ను జయప్రదం చేయండి

- తలారి రంగయ్య, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త



కళ్యాణదుర్గం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ కళ్యాణదుర్గంలోని విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం (సరోజా కాంపౌండ్) నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ

కుందుర్పి: శ్రీమజ్జనపల్లి గ్రామంలో బుధవారం మహర్షి వాల్మీకి విగ్రహాన్ని వివిధ పార్టీల నాయకులు, వాల్మీకి కులపెద్దలు ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన వాల్మీకులు రూ.2 లక్షలతో గ్రామ నడిబొడ్డున ఏర్పాటు చేశారు. ఈనెల 29న వాల్మీకి జయంతిని నిర్వహించనున్నట్లు వాల్మీకులు తెలిపారకు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వడ్డే భీమలింగ కుమారుడు రాజేష్, సరస్వతి వివాహం బుధవారం శ్రీనివాస కళ్యాణమండపంలో జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ సీనియర్ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, కౌన్సిలర్లు కుర్రా రాము, సుధీర్, లక్ష్మన్న, నాయకులు గోళ్ల సూరి, తలారి సత్తి, కృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లి, వెంకటేశులు, పురుషోత్తం ,టైలర్ శీను, గుప్తా, రామిరెడ్డి పాల్గొన్నారు.

కషాయాలతోనే చీడపీడల నివారణ



అప్పిలేపల్లిలో కషాయం తయారు చేస్తున్న దృశ్యం

కుందుర్పి: కషాయాలద్వారానే రైతులు పంటలకు సోకే చీడపీడలను పూర్తిగా నివారించవచ్చని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ టెక్నికల్ ఆర్గనైజర్ ఓబుళపతి, మండల టీం లీడర్ వెంకటేశులు పేర్కొన్నారు. బుధవారం అప్పిలేపల్లి గ్రామంలో రైతు పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు కషాయాలు,సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల భూముల్లో విషతుల్యం ఏర్పడి పంటలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. రైతులకు వావిలాకు కషాయం , ఆవుపేడ, చెరువు మట్టితో జీవామృతం తదితర వాటిని రైతులతో తయారు చేయించారు. రైతు సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, కోఆర్డినేటర్ అతావుల్లా, ఏఎఫ్ ఎకాలజీ ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

చౌక డిపో డీలర్ల కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణం, రూరల్ పరిధిలోని చౌకధాన్యపు డిపోల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎఫ్‌సీఐ గోదాములో జరిగిన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడుగా బండి కిష్టప్ప, అధ్యక్షుడుగా సత్యనారాయణ, కార్యదర్శిగా వెంకటేశులు, ఉప కార్యదర్శిగా తిరుమలేష్, ఉపాధ్యక్షులుగా ఉమామహేశ్వర్, మహేష్, తమ్మయ్య, ఆనంద్, తిప్పేస్వామిని ఎన్నుకున్నారు.

వేంకటరమణుడికి ధనుర్మాస పూజలు



పూజలందుకున్న వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు, తిరుప్పావై సేవకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 13న గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.



రాయదుర్గంలోని సెయింట్ మేరీ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు



శెట్టూరులోని విశ్వవాణి చర్చిలో కేక్ కట్‌చేస్తున్న దృశ్యం



ఉరవకొండ సీఎస్‌ఐ చర్చిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న పాస్టర్ తదితరులు

శాంతిమార్గంలో పయనిద్దాం



రాయదుర్గం సెయింట్‌మేరీ చర్చిలో క్రీస్తు జన్మించిన పశువుల పాక నమూనా



కళ్యాణదుర్గం: క్రీస్తు గీతాలను ఆలపిస్తున్న యువతులు



బెళుగుప్ప: శీర్పి గ్రామంలోని చర్చిలో క్రిస్మస్ కేకును కత్తరింప చేస్తున్న పాస్టర్

- భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

రాయదుర్గంటౌన్/ బొమ్మనహాళ్/గుమ్మఘట్ట/కణేకల్లు: ప్రేమ.. క్షమ క్రీస్తు సందేశమని, ఆ మార్గంలో పయనించి శాంతియుతంగా జీవించాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. క్రిస్మస్ వేడుకలు బుధవారం రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో ఘనంగా జరిగాయి. ఉదయమే చిన్నారులు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లారు. క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ప్రసంగిస్తూ ఏసు ప్రభువు సూచించిన ప్రేమమార్గంలో పయనించి జీవితానికి సార్థకత చేకూర్చుకోవాలన్నారు. వివిధ చర్చిల్లో ఆలపించిన ఏసు భక్తి గీతాలు అలరించాయి.

ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి

కళ్యాణదుర్గం: క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని పాస్టర్లు సూచించారు. బుధవారం పట్టణంలోని సీఅండ్‌ఐజీఎం, అగాపె, హోసన్నా, విక్టరీ, కల్వరి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. సీఅండ్‌ఐజీఎంలో చర్చి డికన్ బోర్డు వారి సహకారంతో కాపరి డీఎస్ పాల్ బైబిల్‌లోని లోక రక్షకుడు పుట్టుక గురించి తెలియజేశారు. మహిళలు, సండే స్కూల్ పిల్లలు పలు క్రీస్తు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. సీఅండ్‌ఐజీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

బ్రహ్మసముద్రం : బ్రహ్మసముద్రం , భైరసముద్రం, వేపులపర్తి, పోలేపల్లి, ఎరడికెర, పాలవెంకటాపురం, సూగేపల్లి, గొంచిరెడ్డిలపలి, ముద్దలాపురం, రాయలదొడ్డి, పొబ్బర్లపల్లి, పిల్లలపల్లిలోని చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చెలిమేలపల్లిలోని ఇమ్మానుయేల్ ప్రార్థనా మందిరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ క్రిష్టియన్ విభాగం అధ్యక్షుడు దేవపుత్ర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం 2025 సంవత్సర క్యాలెండర్ల ఉచితంగా పంపిణీ చేశారు. పాస్టర్ కిరణ్ కుమార్, సందీప్, సంపత్‌కుమార్, రవికుమార్, అంజినేయులు, గంగాధర, సాలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: మండలవ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే క్రైస్తవులు కొత్త దుస్తులను ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఆండ్ఐజీ మిషన్ చర్చిలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కేక్‌ను కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాస్టర్లు జేమ్స్, ప్రభుదాసు, ఎజ్రా, భాస్కర్ ఆయా చర్చిల్లో క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు.

కుందుర్పి: మలయనూరు,ఎనుములదొడ్డి,కుందుర్పి,నిజవల్లి,ఎర్రగుంట,బెస్తరపల్లి చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్లు విజయ్, డేవిడ్, నిజవల్లి ఆమరాజు, పాల్‌దినకర్, ఆనంద్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా నాయకులు నిజవల్లిబాబు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

శెట్టూరు: లోకరక్షణ కోసమే క్రీస్తు జననం జరిగిందని పాస్టర్లు సోమశేఖర్, డేవిడ్, లక్ష్మణ్ అన్నారు. బుధవారం శెట్టూరు, అయ్యగార్లపల్లి, కనుకూరు, బచ్చేహళ్ళి, అనుంపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో క్రీస్తు జననంపై కీర్తనలు పాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉరవకొండ: క్రిస్మస్ వేడుకలు మండల వ్యాప్తంగా అన్నీ ప్రధాన చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఉరవకొండ సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ ప్రమీలా జోసఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, యువనాయకులు ఏసీ పవన్‌తో కలసి ఫాదర్ కేక్‌ను కట్ చేశారు. అలాగే 4వ వార్డులోని 777 చర్చిలో పాస్టర్ లేపాక్షి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మండలంలోని ఆమిద్యాల, రాకెట్ల, నింబగల్లులతో పాటు అన్నీ గ్రామాల్లో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు.

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప, తగ్గుపర్తి, కాలువపల్లి, కోనంపల్లి, శీర్పి, గంగవరం, అంకంపల్లి, హనిమరెడ్డిపల్లి, నరసాపురం గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థన చేశారు.

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ, కలగళ్ల, జల్లిపల్లి(హోసన్నా చర్చి), కూడేరు(బేతనీయ, కవనెంట్ చర్చిలో), ముద్దలాపురం, అరవకూరులోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా చేపట్టారు. పాస్టర్లు ఎర్రిస్వామి, డేనియల్, పౌలు, విక్టర్, సువర్ణ రాజు క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి వివరించారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చితో పాటు మండలంలోని చాబాల, తట్రకల్లు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు ప్రసాద్‌బాబు, జాన్, ఎంసీకుమార్, సర్పంచు మల్లెల జగదీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ చర్చిలో ప్రార్థనలు



చెలిమేపల్లిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దేవపుత్ర



కూడేరు మండలం జల్లిపల్లిలో హోసన్నా కృప చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కణేకల్లులో క్రిస్‌మస్ వేడుకలు



కంబదూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు



కళ్యాణదుర్గం: క్రీస్తు బోధనలు చేస్తున్న చర్చి కాపరి డీఎన్ పాల్



వజ్రకరూరు మండలం తట్రకల్లులో క్రిస్మస్ సందేశం వినిపిస్తున్న పాస్టర్ రెవరెండ్‌జాన్



ఉరవకొండ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

కనకదాస జీవితం ఆదర్శప్రాయం

డి.హీరేహాళ్(బొమ్మనహాళ్): భక్త కనకదాస జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డి.హీరేహాళ్ మండలం లింగమనహళ్లిలో భక్త కనకదాస విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పాల్గొని భక్త కనకదాస విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటనేనే కురుబలు అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భోజరాజునాయక్, సర్పంచ్ బొమ్మన్న, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీలు ఎర్రిస్వామి, మహేష్, నాయకులు మల్లప్ప, రాజా, హనుమంతప్ప, రహతుల్లా, మురళిమెహన్‌రెడ్డి, అంజిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, చింతకాయల ఆంజినేయులు, సింగాడి మంజునాథ్ కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.



భక్త కనకదాసు విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

పోరుబాటను విజయవంతం చేయండి

బొమ్మనహాళ్: పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో రాయదుర్గంలో నిర్వహించే ర్యాలీలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వివేకానంద జయంతి పోస్టర్ల విడుదల

ఉరవకొండ: స్థానిక గవిమఠం ప్రాంగణంలో గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా 2025 జనవరి 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతి పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఉరవకొండ ఆయూర్ అధ్వర్యంలో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ తాటికొండల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయూర్ ప్రతినిధులు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయూర్ అధ్వర్యంలో ఉరవకొండ నియోజకవర్గంలోని అన్నీ ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలల్లో స్వామి వివేకానంద జీవిత చరిత్ర పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు జనవరి 12న బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈశ్వరీ బ్రహ్మకుమారి సంచాలకులు పుష్ప, గీతా ప్రచార సమితి అధ్యక్షులు దివాకర్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబుశేసు, జిల్లా యోగా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న గవిమఠం ఉత్తరాధికారి

ఘనంగా మండల పూజ



విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద గణపతి హోమం నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి



లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం కేరళ తాంత్రిక నిపుణుడు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట. మండల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ సేవాకమిటీ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వేదపండితులు మహాగణపతి హోమం, విశేష కలశ పూజ, గణపతి కలశాభిషేకం, నవ కలశాభిషేకం, పంచగవ్యాభిషేకం, పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్యారాజగోపాల మంత్రార్చన పూజ చేశారు. సాయంత్రం మహాపుష్పాభిషేకం, లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు దాతలతో కలసి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

భారతజాతి గర్వించదగిన నేత వాజ్‌పేయి

రాయదుర్గంటౌన్: భారతజాతి గర్వించదగిన నేత దివంగత ప్రధాని వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వసుంధరాదేవి కొనియాడారు. బుధవారం రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ కో కన్వీనర్ శివశంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సూరే శ్రీధర్, శివానంద, ప్రభాకర్, అంజి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



గుమ్మఘట్టలో రథోత్సవ దృశ్యం

గుమ్మఘట్ట: మండలంలోని గుమ్మఘట్ట, బీటీపీ గ్రామాల్లో ఆంజనేయస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. రథం ముందు భాగాన యువకులు నందికోళ్లతో నృత్యం చేయగా, చిన్నారులు కలశాలను ప్రదర్శించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

విరుపాపల్లిలో ఆరాధన రథోత్సవం

బెళుగుప్ప: మండలంలోని విరుపాపల్లిలో సద్గురు నారాయణార్యారూఢస్వామి రథోత్సవాన్ని బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. 51వ వార్షికోత్సవ ఆరాధన రథోత్సవంలో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి గణపతి పూజ, రుద్ర యజ్ఞం, రుద్రాభిషేకం, మహాబిల్వార్చన , పూజలు చేశారు. రాత్రికి నారాయణస్వామి ఆలయకమిటీ ట్రస్టు నిర్వాహకులు మర్తాడు మఠాధ్యక్షుడు జ్ఞానమూర్తి స్వామి, మఠాధ్యక్షుడు మారాచి సూర్యనారాయణస్వామి, గ్రామ పెద్దలు, ట్రస్టు సభ్యులు, భక్తులు కలసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నారాయణార్యారూఢ స్వామి రథోత్సవం ప్రారంభించారు. మంగళవాయిద్యాలతోను, నందికోలాటలు, చెక్కభజలతో భక్తులు రథోత్సవాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారు ఛత్రప్రభ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



నారాయణార్యారూఢస్వామి రథోత్సవ దృశ్యం

నేడు సీపీఐ శతవసంతోత్సవ సభ

రాయదుర్గంటౌన్: సీపీఐ చరిత్ర, సాధించిన ఉద్యమ ఫలితాలను ప్రజలకు చాటి చెప్పాలని రాయదుర్గం ఇన్‌చార్జ్ నాగార్జున పిలుపునిచ్చారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల పూర్తికావస్తున్న నేపథ్యంలో గురువారం స్థానిక మొలకాల్మూరోడ్డులో శతవసంత్సోవ వేడుక సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.

28న ధర్మరక్షా దివస్

రాయదుర్గంటౌన్: విశ్వ హిందూ పరిషత్ ధర్మప్రసార్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 28న వేణుగోపాలస్వామి ఆలయంలో ధర్మరక్షా దివస్ నిర్వహించనున్నట్లు ధర్మప్రసార్ సహప్రముఖ్‌లు సాంబమూర్తి, ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సమతా రాజ్యం కావాలి

కళ్యాణదుర్గం రూరల్: సాటి మనిషిని మనిషిగా చూడలేని మను స్మృతి తమకు వద్దని సమతా రాజ్యం కావాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. బుధవారం మను స్మృతి పత్రాలను పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా సాకే హరి మాట్లాడుతూ శతాబ్దాల కాలం నుంచి శూద్రులు, అతిశూద్రులని సమాజం నుంచి వేరుచేసి అణచివేస్తూ అంటరానివారుగా చూస్తున్నారన్నారు. అభివృద్ధికి, చైతన్యానికి ఆమడ దూరంలోకి నెట్టేవేస్తూ అధిక జనాభా కలిగిన బహుజన ప్రజలను పాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని హనిమరెడ్డిపల్లి వద్ద బుధవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు సద్దాంహుస్సేన్(40) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సద్దాంహుస్సేన్ టీ కప్పులు గ్లాసులు అమ్మే వ్యాపారం చేస్తూ కళ్యాణదుర్గంలో నివసించేవాడు. వ్యాపార నిమిత్తం ద్విచక్ర వాహనంలో అనంతపురం వెళ్తుండగా హనిమరెడ్డిపల్లి వద్ద లారీ ఢీకొంది. కాళ్లు, తలకు బలమైన రక్త గాయాలవడంతో అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి తమ్ముడు ఇమామ్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ శివ తెలిపారు.

చిరుత సంచారం

కుందుర్పి: కెంచంపల్లి, కలిగొలిమి పరిసర ప్రాంతాల్లో నాలుగు రోజులుగా రెండు చిరుతలు సంచరిస్తుండడంతో పరిసర గ్రామాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడగానే గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పెంపుడు కుక్కలు, పశువుల పాకల్లో పశువులను చిరుతలు దాడిచేసి చంపుతున్నట్లు రైతులు కృష్ణమూర్తి, ఈరన్న, గోవిందప్ప, నాగరాజు తదితరులు పేర్కొన్నారు. రాత్రిళ్లు చిరుతలు సంచరిస్తుండడంతో పంట పొలాలకు నీరుపెట్టేందుకు వెళ్లే తమపై ఎప్పుడు చిరుతలు దాడి చేస్తాయోనని గుంపులుగా వెళుతున్నామన్నారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.